## వైకల్యం విజయానికి అడ్డు కాదు



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

ఆర్కేపురం, డిసెంబర్ 7 : రంగారెడ్డి జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్‌లోని జిల్లా డిసేబిలిటీ రీహాబిలిటేషన్ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఇందిర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం సంతోషంగా సాగుతుందన్నారు. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం పీడిస్తుందన్నారు. కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానసిక రోగులుగా మారిపోతుంటారని చెప్పారు. వైకల్యం విజయానికి అడ్డుకాదని సూచించారు. నరేందర్, వినీతదేవి, రమేశ్, సుస్మిత, జయశ్రీ, రామదేవి, శ్యామలాదేవి పాల్గొన్నారు.

## దివ్యాంగుల జీవితాల్లో మార్పులు తెచ్చాం



మేరీ గ్లోరి-లిలియన్ బ్రెకెల్‌మాన్స్ దివ్యాంగుల అవార్డు -2023 కాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లిలియన్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల జీవితాలలో చెప్పుకోదగిన ఆదర్శప్రాయమైన మార్పులను తీసుకొచ్చామన్నారు. లిలియన్ ఫౌండేషన్ డైరెక్టర్ ఎరిక్ మెన్, సీబీఎం ఇండియా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోనీ థామస్, బాబు అరవల్, ప్రదీశ్, అకిల్‌పాల్, సమీర్, బెన్నీ అంటోనీ, విశాల్‌గుప్తా, రాజు, సోమ శేఖర్, వెంకటారావు పాల్గొన్నారు. -ఆర్కేపురం, డిసెంబర్ 7

## జీఎస్ఐటీఐ 48వ వ్యవస్థాపక దినోత్సవం



నాగోల్, బండ్లగూడలోని భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ) కార్యాలయంలో గురువారం సంస్థ 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంస్థ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ కుటుంబ రావు, అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటేశ్వరరావు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై జీఎస్ఐటీఐ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్ఐటీఐ ప్రధాన కార్యాలయంలో, ఫీల్డ్ ట్రైనింగ్ సెంటర్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ శిక్షణ కేంద్రాల్లో కొత్తగా రిక్రూట్ అయిన జియో సైంటిస్ట్‌లకు శిక్షణనిస్తున్నాయని తెలిపారు. ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ మల్లేశ్ పాల్గొన్నారు.
-మన్సూరాబాద్, డిసెంబర్ 7

## సెల్‌ఫోన్ చోరీల దొంగ అరెస్టు

హయత్‌నగర్, డిసెంబర్ 7 : తాళాలు పగులగొట్టి వరుసగా చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద 6.6 తులాల బంగారు నగలు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, యాపిల్ ఐపాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గురువారం వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, రాయదుర్గం, గ్రీన్‌హిల్స్‌లో నివాసముంటున్న సాంద్ర మహేశ్ వృత్తిరీత్యా కేర్ టేకర్‌గా పని చేస్తుంటాడు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతుంటాడు. పక్కా సమాచారం మేరకు మహేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతడి వద్ద బంగారు నగలు, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, యాపిల్ ఐప్యాడ్ వంటి విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే సబితారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

కందుకూరు, డిసెంబర్ 7 : సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ చైర్మన్ ర్యాపాకు ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కల్లెం సదానంద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు గురువారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మండల పార్టీ ఉపాధ్యక్షుడు సామ మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి గజమాలతో సన్మానించారు.

# ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పూలబొకే అందజేస్తున్న సీనియర్ నాయకుడు వెంకటేశ్


చంపాపేట, డిసెంబర్7: ఎల్బీనగర్ ఎమ్మెల్యేగా మరోసారి గెలుపొందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పలు సామాజిక సంఘాలకు చెందిన వారు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. గురువారం బీఆర్ఎస్ సీనియర్ నేత కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో చంపాపేట, హస్తినాపురం, లింగోజిగూడ ఇంక పలు డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు, సామాజిక సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి పూలబొకేలు అందజేసి గజమాలతో సత్కరించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**హయత్‌నగర్ డివిజన్‌లో...**

హయత్‌నగర్, డిసెంబర్ 7 : ఎమ్మెల్యేగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మూడోసారి గెలుపొందిన సందర్భంగా బీఆర్ఎస్ హయత్‌నగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ శ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి క్యాంపు కా ర్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేశ్‌గౌడ్, హయత్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు గుజ్జ జగన్మోహన్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, గుడాల సందీప్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

**మన్సూరాబాద్‌లో...**

మన్సూరాబాద్, డిసెంబర్ 7: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి కర్మన్‌ఘాట్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్‌పర్సన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, నాయకులు పోచబోయిన గణేశ్‌యాదవ్, రమేశ్ యాదవ్, మల్లెల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్



శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్‌పర్సన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్

## బెడిసికొట్టిన ప్రతిపక్షాల కుట్రలు

### 22 వేల ఓట్ల మెజార్టీతో సుధీర్‌రెడ్డి గెలుపు

ఎల్బీనగర్, డిసెంబర్ 7 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఓడించేందుకు ప్రతిపక్ష పార్టీలు చేసిన పలు ప్రయత్నాలు.. వ్యక్తిగత ఆరోపణలు , కుట్రలు ఫలించలేదు. ఎమ్మెల్యేగా ఉన్న దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు నేరుగా ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలు, నిందారోపణలకు దిగారు. అంతటితో ఆగకుండా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేరుతో మరో స్వతంత్ర అభ్యర్థిని బరిలో నిలిపి ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నం చేశారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనే వ్యక్తిని తీసుకుని వచ్చి ఎల్బీనగర్‌లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టారు. ఇంటిపేరుతో సహా బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో ఒకేలా ఉండటంతో ఈ ఎన్నికల్లో తమకు మేలు జరుగుతుందని భావించారు. అంతటితో ఆగకుండా ఎన్నికలకు రెండు రోజుల ముందు నుంచి సదరు స్వతంత్ర అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గుర్తైన బకెట్ గుర్తును పింక్ రంగు కరపత్రాల్లో ముద్రించి పత్రికల్లో, ఇంటింటికీ చేరవేయడం ద్వారా ప్రజలను అయోమయంలో పడేయాలని యత్నించారు. అంతేకాక రెండు రోజుల ముందు నుంచి తాను దేవిరెడ్డి సుధీర్‌రెడ్డినని, తన గుర్తు ఈ సారి ఎన్నికల్లో బకెట్ గుర్తు అని సీరియల్ నంబర్ 33కు ఓటు వేయాలంటూ కూడా వాయిస్ మెసేజ్ ద్వారా ప్రచారం చేసి ఓటర్లను తికమకపెట్టాలని భావించారు. అయితే ఈ పన్నాగాన్ని ముందస్తుగానే గుర్తించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులను సమాయాత్త పరిచారు. ప్రజలకు కారు గుర్తును బలంగా తీసుకుని పోయారు. దీంతో 22 వేల ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించారు.దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపును అడ్డుకోవాలని చూసిన ప్రతిపక్షాల కుట్రలు ఎల్బీనగర్ ఓటర్ల ముందు పనిచేయలేదని ఫలితాలు రుజువు చేశాయి.